# వ్యూహాత్మక 'రక్షణ' కేంద్రం హైదరాబాద్

- ఇండో-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో కీలకంగా మారిన నగరం
- వార్‌టైం స్ట్రాటజీలో మహానగరానిది ముఖ్య భూమిక
- సిటీలోనే రక్షణ శాఖ విభాగాలతోపాటు, కేంద్ర పరిశోధన సంస్థలు
- పాక్ రేంజ్‌లో సగం రాష్ట్రాలతోపాటు, హైదరాబాద్ కూడా
- హైదరాబాద్‌ను అలర్ట్ చేసేలా అభ్యాస్ కార్యకలాపాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): పహల్గాం ఉగ్రదాడితో దేశం అప్రమత్తమైంది. అన్ని ప్రధాన నగరాలు యాక్షన్ మోడ్‌లోకి వచ్చేలా కేంద్రం అలర్ట్ చేస్తున్నది. అందులో భాగంగా యుద్ధం వస్తే తలెత్తే పరిణామాల నుంచి హైదరాబాద్ నగరానికి పొంచి ఉన్న ముప్పు నుంచి అప్రమత్తం చేయడమే ముఖ్యోద్దేశ్యంగా బుధవారం నగరంలో ఆపరేషన్ అభ్యాస్ పేరిట మాక్ డ్రిల్స్ నిర్వహించారు. కాగా, తాజాగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సింధూర్ నేపథ్యంలో ఇప్పుడు అందరీ దృష్టి హైదరాబాద్‌పై పడింది. నిజాం కాలం నుంచే వ్యూహాత్మక రక్షణ కేంద్రంగా నిలిచిన మహానగరం నాటి నుంచి నేటివరకు త్రివిధ దళాల స్థావరంగా కొనసాగుతూనే ఉంది. క్లిష్ట సమయంలో సైనికులకు ఆయుధాలను అందించే ఆయుధ భాండాగారంగా ఉంటూనే, రక్షణ వ్యవస్థకు సురక్షితమైన, వ్యూహాత్మక కేంద్రంగా నిలుస్తున్నది. రక్షణ శాఖకు అవసరమైన అన్ని మౌలిక వసతులను అందించే కేంద్రంగా, సైబర్ దాడులను ఎదుర్కొనే సైబర్ టెక్నాలజీ కలిగిన ప్రాంతంగా, ఎయిరోస్పేస్ హబ్‌గా నిలవడంతోనే హైదరాబాద్‌పై ఇప్పుడు అందరీ దృష్టి పడింది. అమ్ములపొదిలో రక్షణ వ్యవస్థ కేంద్రీకృతమైనట్లుగా ఉండే హైదరాబాద్‌ను విపత్కర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనే అత్యంత కీలకమైన, వ్యూహాత్మక ప్రాంతంగా అభివర్ణిస్తారు. దీనికి నగరం చుట్టూరా ఉన్న మిలటరీ, ఎయిర్ ఫోర్స్, సైంటిఫిక్ తదితర సంస్థలే కారణం. దీంతోపాటు దేశ ఆర్థిక వ్యవస్థలోనూ ముఖ్య భూమికను పోషిస్తున్నది. ఐటీ కేంద్రంగా, ఏయిరోస్పేస్ హబ్‌గా పేరుగాంచిన మహానగరంలో 37కు పైగా కేంద్ర రక్షణ, పరిశోధన, రక్షణ పరిశ్రమలు ఉన్నాయి. ఇందులో అంతరిక్ష పరిశోధనలకు ఇస్రోకు ఉపయోగపడే డేటా సెంటర్‌తోపాటు శాటిలైట్ తయారీలో అవసరమైన చిన్న చిన్న బొల్టులు, ఇంజిన్లు, టర్బైన్లు లాంటి అనేక పరికరాలు ఇక్కడే ఉత్పత్తి అవుతున్నాయి. హకీంపేటలో కేంద్రీకృతమైన ఎయిర్‌ఫోర్స్ స్టేషన్, శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు సమీపంలోని టాటా ఎయిరోస్పేస్ సెంటర్, క్షిపణి రూపకల్పనలో కీలకపాత్ర పోషించే డీఆర్డీవో తదితర పదుల సంస్థలతో రక్షణ పరిశోధనలకు నగరం కేంద్రంగా ఉంది.

**నగరవ్యాప్తంగా రక్షణ సంస్థలే...**

యుద్ధ సమయంలో రక్షణరంగానికి అవసరమైన ఆయుధ సంపత్తిని అందించడంలో హైదరాబాద్ ముందంజలో ఉంది. డిఫెన్స్ రిసెర్చ్, ఉత్పాదక వ్యవస్థలతోపాటు రక్షణ రంగానికి అవసరమైన డీఆర్డీవో, డీఆర్డీఎల్, రిసెర్చ్ సెంటర్ ఇమ్రాత్, డిఫెన్స్ మెటలర్జీకల్ రిసెర్చ్ లాబోరేటరీ, అడ్వాన్స్‌డ్ సిస్టం ల్యాబోరేటరీ, అణు ఉత్పత్తుల్లో కీలకమైన న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ).. ఇలా 37కు పైగా రక్షణ, వాయు, రక్షణ పరిశోధన, సైబర్ సెక్యూరిటీకి సంబంధించిన సంస్థలన్నీ నగరవ్యాప్తంగా కొలువై ఉన్నాయి. ఒకవేళ యుద్ధం వస్తే శత్రుమూకల నుంచి రక్షణ వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఈ ప్రాంతం వ్యూహాత్మక స్థావరంగా సహజసిద్ధంగా గుర్తింపు పొందింది. అందుకే మొదటినుంచి హైదరాబాద్‌లో అనేక రక్షణరంగ సంస్థలను నెలకొల్పారు.

**సిటీ అమ్ములపొదిలో ఎయిర్ డిఫెన్స్**

ఎయిర్ బేస్ సెంటర్‌గా పిలిచే హకీంపేట్ ఎయిర్‌ఫోర్స్ సెంటర్ దేశంలోని ప్రధాన ఎయిర్ బేస్ సెంటర్ల కంటే పెద్దది. బెంగళూరు, చెన్నై నగరాల్లోని ఎయిర్ బేస్ సెంటర్ల కంటే విస్తీర్ణంలో, వ్యూహాత్మక వాయు దాడులను సమర్థవంతంగా నిర్వహించడంలో హకీంపేట్ ఎయిర్ ఫోర్స్ సెంటర్ ముఖ్య భూమికను పోషిస్తున్నది. ఫైటర్‌జెట్లతోపాటు, హెలికాప్టర్ ఫైలట్లను ఇది అందిస్తున్నది. దక్షిణాది నుంచి శత్రుదేశాలపై విరుచుకుపడేలా ఎయిర్‌ఫోర్స్ సెంటర్‌గా హకీంపేట నిలుస్తున్నది. ఇక బోయింగ్ విమానాల ఉత్పత్తులు, టాటా లాక్‌హీడ్ మార్టిన్ వంటి అంతర్జాతీయ డిఫెన్స్ సంస్థలు ఇక్కడ ఉన్నాయి. ఎయిర్‌క్రాఫ్ట్ అండ్ డిఫెన్స్ సిస్టం తోపాటు, అకాశ మార్గంలో గుట్టుగా దూసుకుపోతూ శత్రు స్థావరాలను నిర్వీర్యం చేసే రాఫెల్ ఫైటర్ జెట్లను అందించే రాఫెల్ అడ్వాన్స్ డిఫెన్స్ సిస్టమ్, ఆధునాతన డ్రోన్లను ఉత్పత్తి చేసే స్టార్టప్‌లు పదుల సంఖ్యలో హైదరాబాద్ కేంద్రంగా నిర్విరామంగా సేవలందిస్తున్నాయి.

**సైబర్ దాడులను ఎదుర్కొనేలా...**

దేశంలోని ప్రధాన ఐటీ కేంద్రాల్లో ఒకటైన హైదరాబాద్ నగరం... ముష్కర మూకల సైబర్ దాడులను సమర్థంగా ఎదుర్కొనే కేంద్రంగా పేరుగాంచింది. సిటీ కేంద్రంగా వందల ఐటీ కంపెనీలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా.. సైబర్ సెక్యూరిటీలోనూ హైదరాబాద్ ప్రధాన బాధ్యత వహిస్తున్నది. మైక్రోసాఫ్ట్, గూగుల్, టీసీఎస్ వంటి ఎన్నో కంపెనీలు డిఫెన్స్ అనుబంధ రంగాలకు సైబర్ సెక్యూరిటీ సేవలను అందిస్తుండగా, డేటా సెక్యూరిటీ కౌన్సిల్‌కు ప్రాంతీయ కేంద్రంగా రక్షణ పరిశోధన కేంద్రాలైన డీఆర్డీవో, డీఆర్డీఎల్, ఆర్‌సీఐ, ఈసీఐఎల్‌తో కలిసి కమాండ్ కంట్రోల్ సాఫ్ట్‌వేర్‌కు ఇక్కడే రూపకల్పన చేశారు. భారత సైన్యానికి ఆపత్కాలంలో కీలకమైన సమాచారాన్ని చేరవేసేలా హైదరాబాద్ నిలుస్తున్నది.

**నగరంలోని పలు డిఫెన్స్ సంస్థలు..**

- **డీఆర్డీవో:** త్రివిధ దళాలకు అవసరమైన ఆధునాతన క్షిపణులకు జీవం పోస్తుంది.
- **డీఎంఆర్ఎల్:** అత్యంత తేలికైన మిశ్రమ లోహాలను ఉత్పత్తి చేయడంలో కీలకం. డిఫెన్స్ మెటలర్జికల్ రిసెర్చ్ ల్యాబొరేటరీ ఇప్పటికీ ఎన్నో రకాల ఆర్మ్‌డ్ ఫోర్సెస్, మిస్సైల్, ఎయిర్‌క్రాఫ్ట్‌లను అందిస్తున్నది.
- **డీఆర్‌డీఎల్:** మిస్సైల్ డెవలప్‌మెంట్‌లో ముఖ్యభూమికను పోషించే ఈ సంస్థ ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిస్సైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంకు సారథ్యం వహిస్తున్నది. ఇక్కడే పృథ్వీ, ఆకాశ్ లాంటి మిస్సైళ్లను తయారు చేశారు.
- **ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ:** యుద్ధ ట్యాంకుల నుంచి మొదలుకొని సైన్యం వినియోగించే ఎన్నో రకాల యుద్ధ సామగ్రి ఇక్కడే ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ తయారు చేసిన ఎన్నో యుద్ధ ట్యాంకులు ఇప్పటికే భారత సైన్యానికి సేవలు అందిస్తున్నాయి.
- **మరమ్మతుల స్థావరం ఎంసీఈఎంఈ:** మిలటరీ కాలేజ్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ మెకానికల్ ఇంజినీరింగ్ సంస్థ.. సైనికులు వినియోగించే అన్ని రకాల యుద్ధ సామగ్రికి మరమ్మతులు చేసే మెకానికల్ ఇంజినీర్లను అందిస్తున్నది. అధునాతన మిలటరీ పరికరాలు, రాడార్ వ్యవస్థలు, వాహనాలు విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేలా చూసే నిర్వహణ బాధ్యతలను ఇది భుజాన వేసుకున్నది.
- **ఎన్ఐఎస్ఏ:** సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ అకాడమీ దేశంలోని డీఆర్డీవో, బీడీఎల్, ఎయిర్‌పోర్టులను సంరక్షించే సీఐఎస్ఎఫ్ బలగాలను అందిస్తున్నది. ఇక్కడ శిక్షణ పూర్తిచేసుకున్న సిబ్బంది భారత సైన్యంతోపాటు, ఇతర రక్షణ విభాగాలకు సేవలు అందిస్తున్నారు. వీటితోపాటు 30కిపైగా రక్షణ, రసాయన, పరిశోధన సంస్థలు కూడా హైదరాబాద్ కేంద్రంగా సేవలు అందిస్తున్నాయి.

## ఇండియన్ ఆర్మీకి సెల్యూట్: కేటీఆర్

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): ఆపరేషన్ సింధూర్ పేరిట పాక్ ఉగ్రవాద స్థావరాలపై దాడులకు దిగిన భారత సైన్యానికి సెల్యూట్.. అంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కే తారక రామారావు కొనియాడారు. ఈ దాడుల్లో పాల్గొన్న మనదేశ సాయుధ దళాలకు ఆయన అభినందనలు తెలిపారు. 'ఉగ్రవాద స్థావరాలను నిర్మూలించడంలో సైన్యానికి మరింత శక్తి, సామర్థ్యాలు పెరగాలి. జైహింద్' అని బుధవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

## ధైర్యం మన సైన్యమే: హరీశ్‌రావు

భారతీయుల ధైర్యం.. భారత సైన్యమేనని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు. 'ఉగ్రవాదం మన శాంతిని దెబ్బతీసినప్పుడు, మన ఐక్యత, బలంతో, మన సైనికుల ధైర్యంతో ఎదుర్కొంటామని తెలిపారు. మన దేశంలో ఉగ్రవాదానికి స్థానం లేదని తేల్చిచెప్పారు. భారత సాయుధ దళాల సామర్థ్యంపై అత్యంత గర్వంగా ఉన్నదని పేర్కొన్నారు. మేం వారికి దన్నుగా నిలబడతాం.. జై హింద్!' అని హరీశ్‌రావు ఎక్స్ వేదికగా తెలిపారు.

## సహించేది లేదు: ఎమ్మెల్సీ కవిత

ఉగ్రవాదాన్ని భారతీయులెవరూ సహించబోరని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత స్పష్టంచేశారు. భారత సాయుధ దళాలు పాకిస్థాన్ సరిహద్దుల్లో ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ సిందూర్' నిర్వహించడం గర్వకారణమని తెలిపారు. 'భారత సాయుధ దళాలు ఈ దాడుల ద్వారా విజయం సాధించాయని పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని సహించబోమని ప్రపంచానికి ఒక సందేశం వెళ్లిందని తెలిపారు. భారత్ మాతా కీ జై.. జై హింద్.. జై భారత్' అని ఆమె పేర్కొన్నారు.

## ఉగ్రవాదులను అంతమొందించాలి: వద్దిరాజు

ఉగ్రవాద స్థావరాలను నేలమట్టం చేయాలని, ఉగ్రవాదులను తుద ముట్టించాల్సిందేనని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర కోరారు. పర్యాటకులను అమానుషంగా పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదుల శిబిరాలపై మన రక్షణ దళాలు చేపట్టిన చర్యలకు సెల్యూట్ చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్' పేరుతో చేపట్టిన ముష్కరుల నిర్మూలన చర్యలు దిగ్విజయంగా ముగియాలని ఆకాంక్షించారు. రాజకీయాలకు అతీతంగా యావత్తు దేశమంతా రక్షణ దళాలకు సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని తెలిపారు

## ఉగ్రవాదం అంతం కావాల్సిందే: వేముల

పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత సైన్యం చేపట్టిన సైనిక చర్యపై భారతీయుడిగా గర్వపడుతున్నానని మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. మన సత్తాచాటిన భారత సైన్యానికి అభినందనలు చెప్పారు. ప్రతిఒక్కరూ భారత సైన్యానికి అండగా నిలిచి వారి ధైర్యసాహసాలను మెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ సమయంలో భారతీయులంతా ఐక్యతను ప్రదర్శించాలని కోరారు.

## కూకటివేళ్లతో పెకిలించాలి: నిరంజన్‌రెడ్డి

వనపర్తి టౌన్, మే 7: ఉగ్రవాద సంస్థలను కూకటివేళ్లతో సహా పెకిలించి వేయాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి కోరారు. ఉగ్రవాద స్థావరాలపై బుధవారం భారత్ సైన్యం జరిపిన దాడికి మూకుమ్మడిగా మద్దుతు పలకాలని పిలుపునిచ్చారు. అమాయకులను కాల్చిచంపిన ఉగ్రమూకలపై భారత సైన్యం చేపట్టిన చర్యలకు సెల్యూట్ చేస్తున్నామని తెలిపారు. దేశం మొత్తం సైనికుల వెంటే ఉన్నదని, పార్టీలకతీతంగా దేశమంతా వారి వెనుక నడుస్తుందని స్పష్టంచేశారు. భారతీయులందరూ ఐక్యతను చాటాల్సిన సందర్భం ఇదని, 'ఆపరేషన్ సిందూర్'తో ఉగ్రమూకల నిర్మూలన కార్యక్రమం విజయవంతం కావాలని కోరారు.

## దేశ భద్రతే ముఖ్యం: వినోద్‌కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, మే 7: దేశ భద్రతే అన్నింటికన్నా ముఖ్యమని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. పాక్ ప్రతిదాడులను కూడా సైన్యం సమర్థవంతంగా తిప్పికొడుతుందనే నమ్మకం ఉన్నదని తెలిపారు. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను పూర్తిగా ధ్వంసం చేయాలని కోరారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత కేంద్రం దేశ భద్రతకు సంబంధించి ఏ నిర్ణయం తీసుకున్నా బీఆర్ఎస్ మద్దతు ఇస్తుందని ప్రకటించామని, గతంలో సర్జికల్ స్ట్రైక్ సమయంలోనూ తమ పార్టీ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. 'ఆపరేషన్ సిందూర్'కు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని తెలిపారు.

## ఉద్యోగులూ సెలవులు రద్దు చేసుకోండి: సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): దేశంలో యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ నిత్యం అందుబాటులో ఉండాలని, ముఖ్యంగా సెలవులు, విదేశీ టూర్లను తక్షణం రద్దు చేసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర ప్రజలు తగినంత ఆహార నిల్వలు ఉండేలా సిద్ధం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

## ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలి

### 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్

బెంగళూరు : ఉగ్రవాదుల చర్యలు యావత్తు మానవాళికి వ్యతిరేకమైనవని, ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' వ్యవస్థాపకుడు శ్రీ శ్రీ రవిశంకర్ చెప్పారు. 'ఆపరేషన్ సిందూర్'పై ఆయన స్పందిస్తూ, చర్చలు, సంభాషణల ద్వారా అర్థం చేసుకునే శక్తి, సామర్థ్యాలు లేనివారిని వారి చర్యలకు జవాబుదారీ చేయాలని, వారికి గట్టి గుణపాఠం చెప్పాలని అన్నారు.

## గట్టి జవాబిస్తాం

- పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్
- ప్రతీకార దాడులు ఉంటాయని ప్రకటన

హైదరాబాద్, మే 7 (నమస్తే తెలంగాణ): శుత్రువుకు ఎలా జవాబు చెప్పాలో తమ సైన్యానికి తెలుసు అని పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ పేర్కొన్నారు. భారత్ చేపట్టిన యుద్ధ చర్యకు దీటుగా జవాబు చెప్పే హక్కు పాకిస్థాన్‌కు ఉన్నదని, నిజానికి తమ ప్రతిఘటన బలంగా ఉన్నదని చెప్పుకున్నారు. శత్రువును తన దుర్మార్గపు ఎత్తుగడలలో విజయం సాధించడానికి ఎన్నడూ అనుమతించబోమని పేర్కొన్నారు. ప్రధాని షెహబాజ్ షరీఫ్ నేతృత్వంలోని నేషనల్ సెక్యూరిటీ కమిటీ (ఎన్ఎస్‌సీ) బుధవారం అత్యవసరంగా సమావేశం అయ్యింది. పాక్ ఉప ప్రధాని ఇషాక్ దార్, రక్షణ మంత్రి ఖాజావా ఆసిఫ్, జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ కమిటీ చీఫ్ జనరల్ షాహిర్ శంషద్ మీర్జా, ఐఎస్ఐ డైరెక్టర్ జనరల్ అసిమ్ మాలిక్, ఇతర సైనిక ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారత్‌పై ప్రతీకార దాడికి సైన్యానికి పూర్తి స్వేచ్ఛను ఇస్తూ నిర్ణయం తీసుకున్నారు. ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడులు చేయాలో సైన్యం నిర్ణయం తీసుకోవాలని సూచించారు. భారత్ దాడుల్లో 26 మంది మరణించారని, 46 మంది గాయపడ్డారని ఇంటర్ సర్వీసెస్ పబ్లిక్ రిలేషన్స్ (ఐఎస్పీఆర్) డైరెక్టర్ జనరల్ ప్రకటించారు.

## పోరాటం ఉగ్రవాదంపైనే.. ప్రజలపై కాదు

- సైనికుల ధైర్యసాహసాలకు జేజేలు
- దాడికి ప్రతిదాడి చేసేందుకు భారత్ నిరంతరం సిద్ధమే
- ఆపరేషన్ సిందూర్ విజయవంతం
- సీనియర్ జర్నలిస్టు రాకా సుధాకర్

హైదరాబాద్ సిటీబ్యూరో, మే 7 (నమస్తే తెలంగాణ): భారత సైనికుల పోరాటం పాక్ ఉగ్రవాదులపైనే కానీ, అక్కడి ప్రజలపై కాదని సీనియర్ జర్నలిస్టు, రాజకీయ విశ్లేషకుడు రాకా సుధాకర్ పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేసిన భారత సైనికుల ధైర్యసాహసాలకు జేజేలు పలకాలని పిలుపునిచ్చారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా రాకా సుధాకర్ బుధవారం 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

**లక్ష్యాన్ని ఛేదించారు..**

ఆపరేషన్ సిందూర్ చాలా రోజుల క్రితమే చేయాల్సింది. గతంలో మన సైనికులను చంపితే సరిహద్దు వరకు మాత్రమే వెళ్లి యుద్ధాలు చేశాం. కానీ, గత కొన్నేండ్లుగా యుద్ధంలో సైనికులు దూసుకుపోతున్నారు. సర్జికల్ స్ట్రైక్ సమయంలో సరిహద్దు దాటి 25 కిలోమీటర్ల లోపలికి వెళ్లారు. బాలాకోట్ ఎయిర్ స్ట్రైక్ సమయంలో 70 కిలోమీటర్ల లోపలికి వెళ్లి మరీ పోరాడారు. ఈ సారి 9 తొమ్మిది చోట్ల 24 దాడులు చేసి పాకిస్థాన్‌లోని ఉగ్రవాద స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశారు. గతంలో కేవలం పీవోకే పరిధిలోనే యుద్ధాలు జరిగేవి. కానీ, నేడు నేరుగా పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేశారు. మరో 30 వరకు ఉగ్రవాద స్థావరాలు మిగిలి ఉన్నాయి.

**24 నిమిషాల్లోనే ముగించారు**

భారత్ మీద దాడి చేస్తే.. తిరిగి దాడిచేసి, ఎయిర్‌ఫోర్స్‌ను కూడా ధ్వంసం చేస్తామని భారత ప్రభుత్వం ఇప్పటికే పాకిస్థాన్‌ను హెచ్చరించింది. 24 నిమిషాలు జరిగిన ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్ గగనతలంలోకి వెళ్లి ఉగ్రస్థావరాలను ధ్వంసం చేసి తిరిగివచ్చారు. భారత సైన్యానికి చెందిన ఏ ఒక్క విమానం కూడా ధ్వంసం కాలేదు. పాకిస్థాన్‌కు చెందినవే రెండు విమానాలు ధ్వంసమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా చూస్తే భారత్ సైనిక వ్యవస్థ చాలా గొప్పది. క్రమశిక్షణ, అద్వీతీయ నాయకత్వానికి మారుపేరు.

**మాక్ డ్రిల్ అందుకే అవసరం**

హైదరాబాద్ లాంటి ముఖ్యమైన ప్రాంతాలపై ఉగ్రవాదుల కన్ను నిరంతరం ఉంటుంది. ప్రభుత్వంతోపాటు ప్రజలు సైతం వారి చర్యలను తిప్పికొట్టాలి. స్వీయ రక్షణలో భాగమే మాక్ డ్రిల్స్. హైదరాబాద్‌లో నాలుగు రక్షణ స్థావరాలు ఉన్నాయి. వాటిలో డీఆర్‌డీవో, న్యూక్లియర్ ఫ్యూయల్ కాంప్లెక్స్(ఎన్ఎఫ్‌సీ), సికింద్రాబాద్‌లోని కంటోన్మెంట్ ప్రాంతం, గోల్కొండ. ఈ నాలుగు ప్రాంతాల్లో దాడిచేసేందుకు ఆస్కారం ఎక్కువ. 1971 తర్వాత మళ్లీ ఇప్పుడు మాక్‌డ్రిల్స్ నిర్వహించారు. మాక్ డ్రిల్స్ అత్యంత కీలకం. బాంబు దాడులు సరిహద్దుల్లోనే జరగవు కదా.

**అబద్ధాలు ప్రచారం చేయొద్దు**

ఈ సమయంలో ప్రజలకు, ప్రభుత్వానికి వ్యత్యాసం లేదు. రెండూ ఒకటే. దేశ ప్రజలంతా దేశం కోసం పోరాటం చేయాలి. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయొద్దు. ప్రభుత్వం అధికారికంగా ప్రకటించే వాటినే ప్రచారం చేయాలి. అన్నికంటే ముందు ప్రతి ఒక్కరూ మీ విధులను సక్రమంగా నిర్వర్తించాలి. యుద్ధాల వల్ల తీరని ఆర్థిక నష్టం ఏర్పడుతుందనే విషయం ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి.

**సాంకేతికంగా ముందున్నాం..**

భారత సైన్యం సాంకేతికంగా కొత్త పుంతలు తొక్కుతున్నది. గతంలో బాలాకోట్ ఘటనలో దాడి అనంతరం తిరిగివస్తున్న రెండు విమానాల్లో ఒకటి కుప్పకూలిపోవడంతో అభినందన్ పాక్‌లో చిక్కుకుపోయారు. అయినా కూడా భారత్ ఆయనను తీసుకొచ్చింది. నాటికి, నేటికి భారత సైన్యం సాంకేతికంగా మరింతగా బలపడింది.

## మనందరం గర్వించదగ్గ క్షణం

### ప్రధాని మోదీ ప్రశంసలు

న్యూఢిల్లీ, మే 7: పాకిస్థాన్, పీవోకేలలోని ఉగ్ర స్థావరాలే లక్ష్యంగా భారత భద్రతా దళాలు చేపట్టిన సైనిక చర్యపై ప్రధాని మోదీ ప్రశంసలు కురిపించారు. భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన కొద్ది గంటల్లోనే ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర క్యాబినెట్ సమావేశమైంది. సమావేశంలో ప్రధాని మోదీ భారత భద్రతా దళాలు చేపట్టిన సైనిక చర్యను కొనియాడారు. ఇది మనమందరం గర్వించదగ్గ క్షణం అని పేర్కొన్నారు. భద్రతా దళాలు ఉగ్రస్థావరాల్ని ధ్వంసం చేయటం, ఉగ్రవాదుల్ని మట్టుబెట్టడంపై కేంద్ర క్యాబినెట్ హర్షం వ్యక్తం చేసింది. దీనికంటే ముందు, భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టిన సంగతిని కేంద్ర క్యాబినెట్‌కు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలియజేశారు.

మొదటిపేజీ తరువాయి...

## దుమ్మురేపిన రాఫెల్

జరిగిందని రక్షణ రంగ నిపుణులు చెప్తున్నారు.

**ప్లాన్ ప్రకారం కన్‌ఫ్యూజన్**

రక్షణ రంగ నిపుణుల కథనం ప్రకారం.. పాక్‌తో నెలకొన్న ఉద్రిక్తతల కారణంగా భారత రక్షణ దళం సరిహద్దుల్లో భద్రతను పటిష్టం చేసింది. ఇందులో భాగంగా పాక్ సరిహద్దుల్లో మంగళవారం రాత్రి పొద్దుపోయాక డ్రోన్లతో రెక్కీ నిర్వహించింది. రెక్కీలో పాల్గొన్న డ్రోన్లలో కొన్ని పాక్, పీవోకేలోని ఉగ్ర శిబిరాలకు సమీపంలో తచ్చాడాయి. అయితే, ఈ డ్రోన్ల ఉనికిని పాక్ రక్షణ దళానికి చెందిన రాడార్లు గుర్తించాయి. దీంతో ఆయా డ్రోన్లను ట్రాక్ చేయడంలో పాక్ సేనలు మునిగిపోయాయి. ఇదే అదునుగా రాఫెల్ యుద్ధ విమానాలు సెకండ్ల వ్యవధిలో తొమ్మిది ఉగ్ర స్థావరాలపై స్కాల్ప్ క్షిపణులను, స్టార్మ్ బాంబులను (హ్యామర్ బాంబులు) జారవిడిచాయి. శిబిరాల ధ్వంసరచనలో లాయిటరింగ్ మ్యూనిషన్ (ఆత్మాహుతి డ్రోన్లు) కూడా భాగమయ్యాయి. ఈ హఠాత్పరిణామానికి షాక్‌కి గురైన పాక్ సేనలు.. రాడార్ ట్రాకింగ్ స్టిస్టమ్‌ను యుద్ధ విమానాల వైపునకు మళ్లించాయి. ఇదే అదునుగా అక్కడే తచ్చాడుతున్న భారత డ్రోన్లు ఉగ్ర శిబిరాల దాడులకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను కెమెరాలతో బంధించాయి. దాడులు జరిగాయన్న ఆధారాల కోసమే ఈ విధంగా చేశాయి. పాక్ సేనలు ప్రతిదాడులకు అప్రమత్తమయ్యే లోగా వాయువేగంతో స్వదేశానికి పరుగుపెట్టాయి.

**పొరబడి.. ఆ తర్వాత**

'ఆపరేషన్ సిందూర్'తో పూర్తిగా దెబ్బతిన్న పాక్.. ఐదు భారత యుద్ధ విమానాలను కూల్చేశామంటూ అసత్య ప్రచారానికి తెరతీసింది. దీంతో ఎయిర్‌ఫోర్స్ వర్గాలు స్పందించాయి. 'ఆపరేషన్ సిందూర్'లో ఎలాంటి నష్టం జరుగలేదని, విమానాలు సహా అందరూ సురక్షితంగా తిరిగొచ్చారని వివరించింది.

**అడ్డుకోవాలని అంతలోనే..**

ఉగ్ర శిబిరాలపై దాడులు చేసి వెనక్కి వస్తున్న రాఫెల్ యుద్ధ విమానాలను అడ్డుకోవడానికి చైనాకు చెందిన శక్తిమంతమైన జేఎఫ్-17, పాక్‌కు చెందిన ఎఫ్-16 విమానాలు ప్రయత్నించాయి. అయితే, వాటి ప్రయత్నాలు నిష్ఫలమయ్యాయి. ఈ క్రమంలో ఆయా విమానాలను భారత్ కూల్చేసింది. అయితే, ఈ విషయాన్ని పాక్ తొలుత అంగీకరించనప్పటికీ, ఆ తర్వాత ఒప్పుకోవాల్సి వచ్చింది. పాక్‌కు ఎఫ్-16 విమానాలను అమెరికా సరఫరా చేసింది. ఇదిలాఉండగా.. హనుమంతుడు లంకకు వెళ్లి కాల్చేసి వచ్చినట్టు.. తాము ఉగ్ర శిబిరాలను పేల్చేశామని రక్షణమంత్రి రాజ్‌నాథ్ పేర్కొన్నారు. దీన్ని బట్టి రఫేల్ యుద్ధ విమానాల సాయంతో ఉగ్ర శిబిరాలపై భారత్ క్షిపణి, డ్రోన్ దాడులు నిర్వహించిందన్న విషయం అర్థమవుతున్నది.స్కాల్ప్ క్షిపణులు, హ్యామర్ బాంబులు (స్టార్మ్ బాంబులు), లాయిటరింగ్ మ్యూనిషన్ (ఆత్మాహుతి డ్రోన్ల)ను వాడినట్టు రక్షణ రంగ నిపుణులు చెప్తున్నారు.

## యుద్ధం వస్తే పాక్ కనుమరుగే

### ఆర్మీ మాజీ అధికారుల స్పష్టీకరణ

*హైదరాబాద్ సి